నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 30 జూన్ 2024 | BHADRADRI KOTHAGUDEM



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

# వార్డెన్లు స్థానికంగా ఉండాలి

- **ఆశ్రమ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా పాటించాలి**
- **భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్**

అశ్వారావుపేట/దమ్మపేట, జూన్ 29 : ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, వార్డెన్లు స్థానికంగా ఉండాలని, లేదంటే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో బి.రాహుల్ హెచ్చరించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధుల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల పునఃప్రారంభం దృష్ట్యా ఇళ్ల నుంచి వచ్చే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అశ్వారావుపేట మండలం భీముని గూడెం ఆశ్రమ పాఠశాల, దమ్మపేట మండలం అంకంపాలెం గురుకుల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా మెనూ కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో విద్యార్థులు బయటకు వెళ్లకుండా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి బోధనా తీరును పరిశీలించారు. అసంపూర్తి ప్రశ్నలతో విద్యార్థులను తికమకపెట్టిన సబ్జెక్టు టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని, అలాగే జవాబులు రాబట్టాలని సబ్జెక్టు టీచర్లకు సూచించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగు నీరు, విద్యుత్, ఫ్యాన్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం భోజన నాణ్యతను తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఏటీడీవో చంద్రమోహన్ తదితరులు ఉన్నారు.

# ఆ ఐదు గ్రామాలను తిరిగివ్వాలని కోరతాం

**ఏపీ, టీజీ మధ్య ఎప్పుడు చర్చ జరిగినా దీనినే ప్రధానాంశంగా పెడతాం**

**విభజన హామీలు, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తాం**

**ఆ గ్రామాలు వెళ్లడంతో భద్రాచలానికి కనీసం డంపింగ్ యార్డు లేని పరిస్థితి**

**విలీన గ్రామాలను తిరిగి ఇస్తే వరదపరంగా ఏపీకి ఇబ్బంది ఏమీ ఉండదు**

**విలేకరుల సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జూన్ 29 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భద్రాచలం మండలంలోని ఐదు విలీన గ్రామాలను తిరిగి తెలంగాణకు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వరద ముంపునకు ఏమాత్రమూ సంబంధం లేని ఆ గ్రామాలను తిరిగి భద్రాచలం మండలంలో కలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన హామీలు, తెలంగాణకు రావాల్సిన ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల మధ్య పాలనాపరమైన అంశాలపై ఎప్పుడు చర్చ జరిగినా విలీన గ్రామాలను తిరిగి ఇచ్చే విషయాన్ని ప్రధాన అంశంగా చర్చిస్తామని అన్నారు. ఈ గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనం కావడం వల్ల.. దినదినాభివృద్ధి చెందుతున్న భద్రాచలం పట్టణానికి డంపింగ్ యార్డు కూడా లేని పరిస్థితి ఏర్పడిందని, చెత్త ఎక్కడ పోయాలో కూడా తెలియని దుస్థితి తలెత్తిందన్నారు. ఈ విలీన గ్రామాలకు తిరిగి తెలంగాణకు కేటాయించడం వల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వరద నీటిపరంగా ఎటువంటి ఇబ్బందీ ఉండదని అన్నారు. ఈ గ్రామాలు ముంపునకు సంబంధం లేని గ్రామాలుగా వివరించారు.

**ఉమ్మడి జిల్లా అభివృద్ధికి రూ.655 కోట్లు మంజూరు**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జాతీయ రహదారుల నిర్మాణం, పలు అభివృద్ధి పనుల కోసం రూ.654.86 కోట్ల నిధులు మంజూరైనట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది యాక్షన్ ప్లాన్‌లో భాగంగా తమ ప్రభుత్వం నుంచి ఈ నిధులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లాకు మంజూరైన రోడ్లు, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నిధులు మంజూరు చేసిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ, మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ రహదారులకు సంబంధించి త్వరలోనే డీపీఆర్ పూర్తి చేస్తామని, సాంకేతిక అనుమతుల మంజూరు అనంతరం టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని వివరించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

# మనోళ్ల రచనలకు అమెరికా సావనీర్‌లో చోటు

అశ్వారావుపేట టౌన్, జూన్ 29 : తెలంగాణ అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో మెగా కన్వెన్షన్ కోసం ముద్రించిన ప్రత్యేక సావనీర్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రానికి చెందిన రచయిత డాక్టర్ సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు, బాల రచయిత సిద్ధాంతపు సాత్విక్ సాయికుమార్‌ల రచనలకు స్థానం లభించింది. ఈ మేరకు రచయిత ప్రభాకరాచార్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాను రచించిన 'తెలంగాణ సాహిత్య చరిత్రకు చేవ్రాలు పాల్కురికి సోమన' అనే వ్యాసానికి, బాల కథకుడు సాత్విక్ సాయికుమార్ రాసిన 'అపాయంలో ఉపాయం' అనే కథా రచనకు స్థానం కల్పించినట్లు పేర్కొన్నారు.

# పోస్టులు పెంచండి మహాప్రభో..

- డీఎస్సీ వాయిదా వేయాలి.. ఖాళీ పోస్టులను డీఎస్సీలో కలపాలి..
- ఖమ్మంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల అభ్యర్థుల ధర్నా




ఖమ్మంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ధర్నా చేస్తున్న పోటీ పరీక్షల అభ్యర్థులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 29 : 'పోస్టులు పెంచండి మహాప్రభో..' అంటూ నిరుద్యోగ అభ్యర్థులు నినదించారు. గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్య పెంచాల్సిందేనని డిమాండ్ చేశారు. అలాగే డీఎస్సీని మూడు నెలల పాటు వాయిదా వేయాలని గళమెత్తారు. ఖమ్మం జిల్లా నుంచి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు.. పోస్టులు పెంచాలన్న డిమాండ్‌పై నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. వందలాది మంది నిరుద్యోగులు ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నోటిఫికేషన్‌లో ఉన్న పోస్టులకు అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. పోస్టులు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ హామీని అమలు చేయడం లేదని ఆరోపించారు. హామీని విస్మరించడమంటే నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని స్పష్టం చేశారు. డీఎస్సీ షెడ్యూల్‌ను మూడు నెలల పాటు వాయిదా వేయాలని, ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను ఈ డీఎస్సీలోనే కలపాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతోపాటు ఇతర నిరుద్యోగ అభ్యర్థులు కూడా పాల్గొన్నారు.

# బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

**టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ**

**సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు**



సమావేశంలో మాట్లాడుతున్న కాపు కృష్ణ

రామవరం, జూన్ 29 : తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లన్నింటినీ సింగరేణి సంస్థకు నామినేటెడ్ పద్ధతిలో కేటాయించాలని టీబీజీకేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సత్తుపల్లి, కోయగూడెం ఓసీలను ప్రైవేట్‌కు కేటాయించినా.. పనులు ఎవరు ప్రారంభించినా ఊరుకోమని గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో హెచ్చరించడంతో ఎవరూ సాహసించలేదన్నారు. ఇప్పుడు శ్రావణపల్లి బ్లాక్‌ను హైదరాబాద్ కేంద్రంగా జరిగిన వేలంలో స్వయంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొనడం సరికాదన్నారు. టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జూలై 1న గనులపై నల్లబ్యాడ్జీలు ధరించి వినతిపత్రాలు అందజేస్తామని, 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, 9న గోదావరిఖని కేంద్రంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నా ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఆయా పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయాలని, యూనియన్లకు అతీతంగా అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు కూసన వీరభద్రం, గడప రాజయ్య, కిరణ్, విజయ్, మురళి, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, అశోక్, శ్రీనివాస్, సూరజ్, గణేశ్, తిరుపతి, నరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

# మోదీ మాటల్లో వాస్తవికత లేదు

**అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 స్థానాలకు పరిమితమైంది**

**పార్టీ మారే ఎమ్మెల్యేలు మొదట వారి పదవులకు రాజీనామా చేయాలి**

**విలేకరుల సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

కమాన్‌బజార్, జూన్ 29 : అబద్ధాలు చెప్పడంలో ప్రధాని మోదీ.. గోబెల్స్‌ను మించిపోయారని, దేశ చరిత్రలో ఏ ప్రధానీ చెప్పనన్ని అబద్ధాలు చెప్పిన రికార్డును సొంతం చేసుకున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. ఈ ఎన్నికల్లో అతి తక్కువ మెజార్టీతో గెలిచిన ప్రధానిగా కూడా ఆయన అపకీర్తిని మూటకట్టుకున్నారని ఎద్దేవా చేశారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా ఖమ్మంలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడారు. అభివృద్ధికి మోదీ ఏమీ గ్యారెంటీ కాదని, అతడి మాటల్లో వాస్తవికత లేకపోవడం వల్లనే బీజేపీ ఈ ఎన్నికల్లో 240 స్థానాలకు పడిపోయిందని అన్నారు. తెలంగాణాలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై నారాయణ స్పందించారు. ప్రజాప్రతినిధులను చేర్చుకున్నంత మాత్రాన విపక్షం లేకుండాపోదని, అప్పుడు ప్రజలే విపక్షమవుతారన్న వాస్తవాన్ని చరిత్ర చెబుతోందని అన్నారు. పార్టీ మారే వారు ఎవరైనా సరే.. వారు అంతకుముందు ఏ పార్టీ నుంచి గెలిచి పదవిలో ఉన్నారో ఆ పదవికి రాజీనామా చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. రాజీనామా చేశాకే పార్టీ మార్పు జరగాలని స్పష్టం చేశారు. బీజేపీకి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు పెరగడంపై కాంగ్రెస్ ఆలోచన చేయాలని సూచించారు. బీజేపీ బలపడడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, తమ పార్టీ రాష్ట్ర సమితి సమావేశాల్లో పార్టీ కార్యక్రమాలను చర్చించుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జాతీయ కార్యదర్శి అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర నాయకులు పల్లా వెంకటరెడ్డి, సాబీర్‌పాషా, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే జానీమియా పాల్గొన్నారు.

# బీటీపీఎస్‌లో పిడుగుపాటు

**మంటలు చెలరేగడంతో భారీగా నష్టం**

**ఒకటో యూనిట్‌లో విద్యుత్‌ను నిలిపివేసిన అధికారులు**

**మంటలను అదుపు చేసిన అగ్నిమాపక శాఖ సిబ్బంది**



బీటీపీఎస్‌లో ఎగసిపడుతున్న మంటలు

మణుగూరు టౌన్, జూన్ 29 : మణుగూరులోని బీటీపీఎస్‌లో శనివారం రాత్రి జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిడుగుపాటుతో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో మంటలు చెలరేగడంతో భారీ నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో గల ఒకటో యూనిట్‌పై శనివారం రాత్రి పిడుగుపడింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో వెంటనే అప్రమత్తమైన అధికారులు యూనిట్-1లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. మంటలను అదుపు చేసేందుకు బీటీపీఎస్ అగ్నిప్రమాక శాఖ అధికారులు, సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. అయితే ఎగసిపడుతున్న మంటలను చూసి కార్మికులు, సమీప ఉద్యోగులు పరుగులు పెట్టారు. యూనిట్-1, 2ను స్టేజ్-1గా, యూనిట్-3, 4ను స్టేజ్-2గా పరిగణిస్తుండగా.. జీటీ ట్రాన్స్‌ఫార్మర్ స్టేజ్-1 వద్ద అగ్ని ప్రమాదం సంభవించి మంటలు చెలరేగడంతో ఆందోళనకు గురైన సిబ్బంది హడావుడిగా విద్యుత్ ఉత్పత్తిని యూనిట్-1, లేదా యూనిట్ -2లో నిలిపివేశారా.. అన్నది తేలాల్సి ఉంది. అయితే అధికార వర్గాలు పిడుగుపాటు అని ధ్రువీకరిస్తుండగా, స్విచ్ యార్డ్ వద్ద పిడుగుపాటుకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ సమీపంలో ఉండే జీటీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద అగ్ని కీలలు ఎగిసిపడటంతో పిడుగుపాటు ప్రభావమా.. లేదా సాంకేతిక లోపమా.. అన్నది తేలాల్సి ఉంది. నష్టం రూ.కోట్లల్లో ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై బీటీపీఎస్ సీఈ బిచ్చన్నను వివరణ కోరగా.. యూనిట్-1లో విద్యుత్ సరఫరాను నిలిపివేశామని, మూడు యూనిట్లు రన్నింగ్‌లో ఉన్నాయని తెలిపారు. విచారణ పూర్తయిన తర్వాత మాత్రమే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# నేర విచారణలో జాప్యం వద్దు


- **'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్ష పడాలి**
- **నెలవారీ సమీక్షలో భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**

కొత్తగూడెం క్రైం, జూన్ 29 : కేసుల విచారణలో పోలీసు అధికారులు జాప్యం చేస్తే చర్యలు తప్పవని, 'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్' ద్వారా నేరస్తులకు శిక్షపడే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో ఎస్పీ తన కార్యాలయంలో శనివారం నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై ఒకటో తేదీ నుంచి అమలులోకి వచ్చే కొత్త చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది అవగాహన పెంచుకోవాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు రవాణా చేసే వారితోపాటు సేవించే వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ ప్రమాద అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిత్యం వివిధ రకాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి.. వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీశ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, జిల్లా పోలీస్ కార్యాలయ ఏవో జయరాజు, అన్ని సబ్ డివిజన్ల సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# అధికార కాంగ్రెస్ పార్టీకి.. అధికారుల స్వామిభక్తి!



గెస్ట్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న అప్పటి ఎమ్మెల్యే 'మెచ్చా', టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ 'కంచర్ల' (ఫైల్)



శిలాఫలకం తొలగించిన ప్రాంతంలో దర్శనమిస్తున్న మేకులు

- **గెస్ట్‌హౌస్‌లో మాజీ ఎమ్మెల్యే పేరున్న శిలాఫలకం తొలగింపు**
- **గత కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి చిహ్నాలను చెరిపే యత్నం**
- **మండిపడుతున్న నియోజకవర్గ బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు**
- **బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**
- **'ఆయిల్ ఫెడ్'లో అక్రమ బాగోతం**

అశ్వారావుపేట, జూన్ 29 : అధికార కాంగ్రెస్ పార్టీకి కొందరు అధికారులు స్వామిభక్తి చాటుకుంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి చిహ్నాలను తొలగించే యత్నం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని, చిహ్నాలు తొలగించినంత మాత్రాన ఏమీ కాదని హితవు పలుకుతున్నారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ సంస్థలో చోటుచేసుకున్న అక్రమ బాగోతం వివరాలు ఇలా ఉన్నాయి.

టీఎస్ ఆయిల్‌ఫెడ్ సంస్థ ఉన్నతాధికారుల విడిది కోసం రూ.2.5 కోట్లతో అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం గ్రామంలో గెస్ట్‌హౌస్ నిర్మించింది. పనులు పూర్తయిన తర్వాత అప్పటి సంస్థ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి, అప్పటి స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ రావు జోగేశ్వరరావు, జడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మితో కలిసి గత ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన అట్టహాసంగా ప్రారంభించారు. ఆయిల్‌ఫెడ్ సంస్థతోపాటు ఇతర శాఖల ఉన్నతాధికారులు విశ్రాంతి తీసుకోవడానికి ఈ గెస్ట్ హౌస్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంది. కానీ.. అధికారులకు ఏమైందో.. లేదా అధికార పార్టీ నేతల సూచనలతోనో గానీ గెస్ట్‌హౌస్ శిలాఫలకాన్ని గుట్టుచప్పుడు కాకుండా తొలగించేశారు. అంతా బాగానే చేశారు గానీ.. ఆ ప్రదేశంలో పూలదండలు కట్టేందుకు ఏర్పాటు చేసిన మేకులను మాత్రం తీయలేకపోయారు. శిలాఫలకం తీసిన తర్వాత ఆనవాళ్ళు కనిపించకుండా మేకులు తీయకుండానే సున్నంతో కప్పేశారు. శుక్రవారం మంత్రి తుమ్మల, ఆయిల్‌ఫెడ్ ఎండీ యాస్మిన్ బాషా పర్యటన సందర్భంగా గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన భోజనాలకు వచ్చిన కొందరు రైతులు ఈ విషయాన్ని గమనించారు. ఇదేక్కడి విడ్డూరం అంటూ ముక్కున వేలేసుకున్నారు. శిలాఫలకం తీసేసినంత మాత్రాన గెస్ట్‌హౌస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించినట్లు కాదు కదా.. అంటూ గుసగుసలాడుకున్నారు. సమాచారం తెలుసుకున్న బీఆర్‌ఎస్ క్యాడర్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయం నియోజకవర్గవ్యాప్తంగా వ్యాపించింది. కాంగ్రెస్ పార్టీపై ఎంతగా అభిమానం ఉంటే మాత్రం ఏకంగా గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన అనవాళ్ళను తొలిగిస్తారా... అంటూ రైతులు మండిపడుతున్నారు.

**అధికారులపై చర్య తీసుకోవాలి**

కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి ఆనవాళ్లను కొందరు అధికారులు తొలగించే ప్రయత్నం చేయడం సరికాదు. అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల స్వామిభక్తి చాటుకోవడానికి గత కేసీఆర్ ప్రభుత్వ గుర్తులను తొలగించాలనుకోవడం సైకో చేష్టలకు నిదర్శనం. శిలాఫలకం తొలగించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. శిలాఫలకాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలి.

– జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ఎంపీపీ, అశ్వారావుపేట

# నారు చీరలు!



ఏంటీ.. ఇక్కడ చీరల ఉత్పత్తి కేంద్రం ఉందా? చేనేత కార్మికులు తీరొక్క చీరలు నేశారా? పాత చీరలకు రంగులు వేసి ఆరబెట్టారా? లేదా ఉతికిన చీరలు ఎండబెట్టారా అనుకుంటున్నారా? అలా అనుకుంటే తప్పులో కాలేసినట్లే. మహిళలు ధరించే చూడముచ్చటైన చీరలే మిరపనారుకూ రక్షణ కవచంలా మారాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని గానుగపాడు గ్రామానికి చెందిన రైతులు వినూత్న ఆలోచన చేశారు. పక్షులు, ఇతర క్రిమికీటకాల నుంచి మిరపనారును రక్షించుకునేందుకు నారుమడులపై చీరలు పరిచారు. అంతేకాదండోయ్.. పశువులు, జంతువులు రాకుండా చుట్టూ చేపల వలలు కట్టారు. భూమిపై పరిచిన ఆ చీరలు కనిపిస్తుండడంతో అటువైపుగా వెళ్తున్న ప్రతిఒక్కరూ ఇదేమిటబ్బా.. అని తదేకంగా చూస్తున్నారు.



- చంద్రుగొండ, జూన్ 29